క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక


కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రసమయి

శంకరపట్నం: మండలంలోని ధర్మారం గ్రామం కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది యువకులు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గులాబీ కండువాలను కప్పి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రమేశ్, సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి కృషి

మానకొండూర్: వివిధ గ్రామాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బాలకిషన్ తెలిపారు. గన్నేరువరం మండల కేంద్రంలో ముదిరాజ్, యాదవ సంఘం భవన నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. జంగపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నిర్మాణం ఆగస్టులోగా పూర్తి చేయాలని సూచించారు. మండల కేంద్రంలో అన్ని కులసంఘాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మించడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, వైస్ ఎంపీపీ స్వప్న, సర్పంచులు పుల్లెల లక్ష్మి, అటికం శారద, ఉప సర్పంచ్ బూర వెంకటేశ్వర్లు నాయకులు, కార్యకర్తలు, వివిధ కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ




హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లిఇందిరానగర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు బుధవారం సర్పంచ్ కొడిగూటి శారదప్రవీణ్ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వందరోజులు పనిచేసిన ఉపాధి కూలీలకు తనవంతుగా చీరలు పంపిణీ చేశామని తెలిపారు.

తహసీల్దార్‌కు దరఖాస్తులు


దరఖాస్తులు అందజేస్తున్న నాయకులు

ఇల్లందకుంట: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాములు అన్నారు. బుధవారం సీఐటీయూ, తెలంగాణ రైతుసంఘం, భవన నిర్మాణసంఘం, కేవీపీఎస్, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు ఇళ్ల స్థలాల వ్యక్తిగత దరఖాస్తులు అందజేశారు. పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామని అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలంలో ఒక ఇల్లు కూడా కట్టివ్వలేదని ఆరోపించారు. సొంతస్థలంలో ఇల్లు నిర్మించుకునేవారికి రూ.5 లక్షలు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులుమల్లయ్య,రవి, రాజేశ్వరి, చాంద్‌పాషా, భద్రయ్య, లక్ష్మయ్య, ఓదెలు, మొగిలి,రాధమ్మ, సరోజన పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కేడీఆర్


కేడీఆర్‌ను అభినందిస్తున్న మంత్రి కేటీఆర్

తిమ్మాపూర్: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను బుధవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి కరీంనగర్‌లో కలిశారు. కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులు, కేబుల్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి వచ్చిన కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశానని దేవేందర్ రెడ్డి తెలిపారు. ఇటీవల తిమ్మాపూర్ మండలానికి జాతీయస్థాయి అవార్డు వచ్చినందుకు ఎంపీపీ కేతిరెడ్డి వనితతో పాటు దేవేందర్ రెడ్డిని కేటీఆర్ అభినందించారు.

ఎల్లమ్మ చెరువుకు | గండిపడి ఏడాది కావొచ్చే

- మరమ్మతులు మరిచిన అధికారులు
- భారీ వర్షాలకు గతేదాది గండి
- సాగు, తాగు నీటికి ఇబ్బందులు


గండిపడిన ఎల్లమ్మ చెరువు కట్ట

గంగాధర: మండల కేంద్రంలోని ఎల్లమ్మ చెరువుకు గండిపడి ఏడాది కావొస్తోంది, వానాకాలం ప్రారంభమైనా కట్ట మరమ్మతుల జాడ కనిపించడం లేదు. గతేడాది వర్షాకాలంలో భారీ వర్షాలకు గండిపడగా మరమ్మతులెప్పుడు చేస్తారని ప్రజలు, రైతులు ప్రశ్నిస్తున్నారు. చెరువులో నీరు లేక పోవడంతో సాగు, తాగు నీటికి తంటాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లమ్మచెరువుతో పాటు నారాయణపూర్ చెరువు కలిసే ఉంటాయి. రెండు చెరువులను కలిపి రిజర్వాయర్‌గా మార్పు చేసి ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు నీటిని తరలించడానికి ప్రభుత్వం ప్రతిపాదనలతో పాటు కొంతమేర పనులు సైతం చేశారు. చెరువులో ఎప్పుడు నీరు ఉండటానికి మేడారం చెరువు నుంచి ఎల్లంపల్లి నీటిని తరలించడానికి పైపులైను వేశారు. నాలుగైదేళ్లుగా వేసవిలో సైతం చెరువును నీటితో నింపి కాలువలు, పంపింగ్, తూముల ద్వారా చెరువులు, కుంటల కింద యాసంగి పంటలకు నీరందించారు.

గండిపడిన కట్టలు

గత వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు రావడంతో నారాయణపూర్ గ్రామానికి ముంపు ప్రమాదం ఏర్పడటంతో అధికారులు చెరువుకు గండి పెట్టారు. అదే సమయంలో గంగాధర ఎల్లమ్మ చెరువు కట్టకు సైతం గండి పడింది. రెండు చెరువులకు గండ్లు పడటంతో చుక్క నీరు లేకుండా పోయింది. చెరువుల కట్టలు మరమ్మతులు చేయక పోవడంతో చెరువులపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులు గతంలో ఆందోళనలు చేశారు. రైతులకు మద్దతుగా ప్రతిపక్ష పార్టీలు ఆందోళనకు దిగాయి. ఇదే సమయంలో తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి పరిహారం అందించే వరకు మరమ్మతు పనులు చేయనివ్వమని నారాయణపూర్ గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. గ్రామస్తులను ఒప్పించిన అధికారులు నారాయణపూర్ చెరువు కట్టమరమ్మతు పనులు పూర్తి చేశారు. సంవత్సరాలు గడుస్తున్న తమకు పరిహారం రావడం లేదని ముంపునకు గురవుతున్న మంగపేట గ్రామానికి చెందిన నిర్వాసితులు ఎల్లమ్మ చెరువుకట్ట మరమ్మతు పనులు చేయకుండా అడ్డుకొని నిరాహార దీక్ష చేపట్టారు. అయినా నిర్వాసితులకు పరిహారం రాలేదు కట్ట మరమ్మతులకు నోచుకోలేదు.

ఎల్లమ్మ చెరువు వెలవెల

ఎల్లమ్మ చెరువు కట్ట మరమ్మతు చేయక పోవడంతో పాటు ఇందులోకి మేడారం చెరువు నుంచి పంపింగ్ ద్వారా వచ్చే నీరు రాకుండా అడ్డుకట్ట వేయడంతో చెరువులో నీరు లేక వెలవెల పోతోంది. దిగువ ప్రాంత రైతులు సాగునీటికి, గంగాధర ప్రజలు తాగునీటికి తంటాలు పడుతున్నారు. చెరువుకట్టకు పడ్డ గండి పూడ్చకపోతే ప్రస్తుత వర్షాకాలంలో చెరువు నుండి నీరు వృథాగా పోతుంది. ఎల్లంపల్లి నీటితో చెరువు నింపుకునే అవకాశం ఉన్నా కట్ట మరమ్మతులు చేయక పోవడంతో అవకాశం లేకుండా పోతుంది. పక్కనే ఉన్న నారాయణపూర్ చెరువు జలకళతో ఉంటే ఎల్లమ్మచెరువు ఎండిపోయి దర్శనమిస్తుంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు పట్టించుకొని కట్ట మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాగు విస్తీర్ణం తగ్గుతుంది



ఏడాది కింద గండి పడ్డ ఎల్లమ్మ చెరువు కట్టకు వెంటనే మరమ్మతు చేయాలి. లేకుంటే ఈవర్షాకాలంలో చెరువులో నీరు నిలువ లేక, భూగర్భ జలాలు అడుగంటి పోయి దిగువ ప్రాంతంలో సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు తాగు నీటికి సమస్య తప్పదు.

–సామంతుల మహిపాల్, రైతు, గంగాధర

గ్రామస్తులు సహకరించాలి



ఎల్లమ్మ చెరువు గండిని పూడ్చడానికి మంగపేట గ్రామస్తులు సహకరించాలి. ఏడాదిగా చెరువులో నీరు లేక పోవడంతో రైతులు సాగునీటి, గంగాధర గ్రామస్తులు తాగునీటి సమస్యలతో తంటాలు పడుతున్నారు. వర్షాలు కురువక ముందే పనులు పూర్తి చేయడానికి అధికారులు చొరవ తీసుకోవాలి.

– మడ్లపల్లి గంగాధర్, సర్పంచ్, గంగాధర

పేదల భూములు లాక్కోవద్దు

చొప్పదండి: హరితహారం పేరుతో పేదలు, రైతుల భూములను అధికారులు లాక్కుంటున్నారని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి విమర్శించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. హరితహారం పేద రైతులకు మృత్యుహారంలా మారిందన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పేద దళిత, గిరిజన రైతుల భూముల్లో హరితహారం నిర్వహించడాన్ని ఖండించారు. మండలంలోని ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, ఎస్సారెస్పీ భూములు కబ్జాలకు గురైనా కళ్లు తెరువని అధికారులు, పేదల భూముల వద్దకు వచ్చి కేసులు పెడుతామని హెచ్చరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అధికారులు అత్యుత్సాహం మానుకోవాలని సూచించారు.

ఆర్టీఐ కింద దరఖాస్తు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లిఇందిరానగర్ గ్రామంలో 191 మంది లబ్ధిదారులకు దళిత బంధు పథకం ఎందుకు వర్తింపచేయడం లేదో తెలియజేయాలంటూ గ్రామానికి చెందిన కొడిగూటి ప్రవీణ్ బుధవారం సమాచార హక్కు చట్టం కింద బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు సమర్పించారు. పథకానికి అన్ని అర్హతలున్నప్పటికీ పథకం రాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళితబంధు పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.

దరఖాస్తుల గడువు పొడిగించాలి

రామడుగు: బీసీ కులవృత్తులకు అందించే రూ. లక్ష ఆర్థికసాయం దరఖాస్తుల గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కల్లెపల్లి తిరుపతి ప్రకటనలో కోరారు. బీసీ కులాలకు అందించే ఆర్థికసాయాన్ని రూ. పది లక్షలకు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామం శివాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణిసురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సదానందం, ఎంపీడీవో విజయలక్ష్మీ, కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ఇల్లందకుంట: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలిస్తే అపర భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం రూపురేఖలు మారుస్తానని కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని వివిధ ఆలయాల్లో పనిచేసే 25మంది అర్చకులకు ధూపదీప నైవేద్య పథకం కింద మంజూరైనా నియామకపత్రాలను అందజేశారు. తనుగులలో పురాతన శివాలయంకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానన్నారు. అంతకుముందు అర్చకులు, అధికారులు ఎమ్మెల్సీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్,జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, ఆలయ ఈవో సుధాకర్, బ్రాహ్మణులు, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఇల్లందకుంట: నియామక పత్రాలిస్తున్న కౌశిక్‌రెడ్డి


మానకొండూర్: అర్చకులతో ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆధాత్మిక దినోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులకు ధూపదీప ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. సుడా చైర్మెన్ జీవీ రామక్రిష్ణారావు, జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సర్పంచ్ దేవ సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ నర్సింగరావు, ఆలయ ఫౌండరీ ట్రస్టీలు గోపాల్‌రావు, గర్రెపల్లి శంకర్‌లింగం, ఆలయ ఈవో అనిల్‌కుమార్, ఆలయ ఉద్యోగులు ప్రభాకర్‌రెడ్డి, ఉమేష్, అర్చకులు, నాయకులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఆలయ చైర్మన్ మల్లారావు పూజలు చేశారు. సర్పంచ్ కిషన్‌రావు, ఆలయ ధర్మకర్తలు సుగుణాకర్ రెడ్డి, తిరుపతి తదితరులు ఉన్నారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎంపీపీ కొత్త వినిత ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, ఎంపీడీవో నరసయ్య, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ తిరుపతి ,ఉప సర్పంచ్ జంగా శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ, చైర్మన్ డైరెక్టర్లు తదితరులున్నారు.

గంగాధర: మండలంలో ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా సిబ్బందితో కోట్ల నర్సింహులపల్లి గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం


మానకొండూరు: పోచంపల్లి మోడల్ స్కూల్లో విద్యార్థుల యోగాసనాలు

రామడుగు: మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.రామడుగులో ధర్మజాగరణ సమన్వయ విభాగం ఆధ్వర్యంలో యోగా గురువు మల్లారెడ్డి, జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు శ్రీనివాస్ యోగా గురించి తెలియజేశారు. వెలిచాలలోని సరస్వతి పాఠశాలలో యోగా గురువు కల్లేపల్లి పర్శారాంజీ విద్యార్థులకు యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

శంకరపట్నం: మండలంలో విద్యార్థులు, యువకులు యోగాసనాలు వేశారు.

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో యోగా ప్రాముఖ్యతను యోగా గురువు విశ్వనాథ గురూజీ తెలిపారు. బీజేపీ నాయకులు వివిధ గ్రామాలలోని పాఠశాలలో యోగా డేను నిర్వహించారు.

హుజూరాబాద్: యోగాతో మానసిక వికాసం పెరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన యోగా డేలో పాల్గొన్నారు. శారీరక ఎదుగుదలకు క్రీడలు, మానసిక ప్రశాంతతకు యోగా, ధ్యానం అవసరమని, యోగా ప్రాముఖ్యత ప్రస్తుతం అందరూ గుర్తిస్తున్నారని పేర్కొన్నారు.

జమ్మికుంట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని గీతా మందిర్‌లో నిర్వహించిన యోగా దినోత్సవంలో మాట్లాడారు. యోగాతో మానసిక ప్రశాంతత, దృఢత్వం పెరుగుతుందన్నారు.

హుజూరాబాద్‌రూరల్: యోగాను జీవితంలో ప్రతి ఒక్కరూ భాగం చేసుకోవాలని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని పేర్కొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి సాధించాలి

జమ్మికుంట: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వ్యాపారులు సమన్వయంతో అభివృద్ధి సాధించాలని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఏబీఏఆర్‌డీ), నాబార్డు డీడీఎం జయప్రకాశ్ సూచించారు. బుధవారం పట్టణంలోని కేవీకేలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, అగ్రిక్లినిక్స్, అగ్రిబిజినెస్ వ్యాపారులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. రైతు ఉత్పత్తిదారులు నాబార్డు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఏబీఏఆర్‌డీ ఏజీఎం మనోహర్‌రెడ్డి, నాన్ కిసాన్ ప్రతినిధి నవీన్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

టీ-కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా కొనగాల మహేశ్

కరీంనగర్ టౌన్: టీ-కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా కరీంనగర్ జిల్లా గన్నేరువరంకు చెందిన డాక్టర్ కొనగాల మహేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహేశ్ ఏఐసీసీ సభ్యుడిగా, టీపీసీసీ అధికార ప్రతినిధిగా, మీడియా కమిటీ కన్వీనర్‌గా, మాస్టర్ ట్రైనర్‌గా, పార్టీ ప్రచార కమిటీ సభ్యుడిగా వివిధ హోదాల్లో సేవలందించారు. నమ్మకంతో పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని, తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరిన ప్రజాప్రతినిధులు, నాయకులు

మానకొండూర్: అధికార పార్టీకి చెందిన ముగ్గురు సర్పంచులు, ఒక ఎంపీటీసీ, ఉపసర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ, పలువురు, నాయకులు, కార్యకర్తలు డీసీసీ అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంకు చెందిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు సునీల్, మైలారం, సాంబయ్యపల్లి, చొక్కారావుపల్లి గ్రామాల సర్పంచులు దుడ్డు రేణుక మల్లేశం, చింతలపల్లి నర్సింహా రెడ్డి, ముస్కు కరుణాకర్ రెడ్డి, ఎంపీటీసీ బొడ్డు పుష్పలత, ఖాసీంపేట ఉప సర్పంచ్ బద్దం సంపత్ రెడ్డి, బెజ్జంకి మాజీ వైస్ ఎంపీపీ కటుకం తిరుపతి, మైలారం మాజీ ఉపసర్పంచ్ వరాల మల్లేశం, అంబేద్కర్ సంఘం నాయకులు నేత కిషన్, వివిధ పార్టీల వందమంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యకుడు ఉపేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి, చొక్కా రావు పల్లె ఉపసర్పంచ్ అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు కొలుపుల రవి, తిప్పర్తి పరిపూర్ణాచార్యులు, బీసీ సెల్ అధ్యకుడు మల్లేశం పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అండగా నిలుస్తాం

- తెలంగాణ ఉద్యమకారులు


మాట్లాడుతున్న ఉద్యమకారులు

హుజూరాబాద్: వందలాది మంది ఆత్మబలిదానాలు, త్యాగాల పునాదులమీద ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు అన్నారు. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు ఆవునూరి సమ్మయ్య అధ్యక్షతన హుజూరాబాద్ జేఏసీలో క్రియాశీల పాత్ర వహించిన ఉద్యమకారులు బుధవారం సమావేశమయ్యారు. కాళోజీ నారాయణరావు, ప్రొ. కె.జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొ.కేశవరావు జాదవ్, బియ్యాల జనార్దన్‌రావు వంటి వారితో పాటు ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన వాగ్గేయకారులు, కవుల, రచయితల ప్రస్తావన లేకుండా రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం బాధాకరమని, రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందని ఆవేదనను వ్యక్తం చేశారు. కౌలు రైతుల పట్ల ప్రభుత్వ వివక్షతో ఆత్మహత్యలు పెరిగిపోయాయని, ధాన్యం కొనుగోలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతలను విస్మరించాయని ఆరోపించారు.కులాలు, మతాలు, నిర్బంధ పద్ధతులను అవలంబిస్తు కేంద్రం, రాష్ట్రం పాలన కొనసాగిస్తున్నాయని అన్నారు. అంతకుముందు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ అమరులకు నివాళులు అర్పించారు. ప్రజలు ప్రజాస్వామిక తెలంగాణను కోరుకుంటున్నారని, ప్రజల ఆకాంక్షలకు అండగా నిలుస్తామని ఉద్యమకారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది రాజు, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, రైతు నాయకులు లింగయ్య, మాదిగ మేధావుల ఫోరమ్ నాయకులురత్నం, మాలమహానాడు నాయకులు సతీష్, భారత్ బచావో ఉద్యమ నాయకులు సదానందం, సత్తిరెడ్డి, లెక్చరర్ల ఫోరమ్ ప్రతినిధి డా.టి.శేఖర్, టి.వి.ప్రసాద్, పొడిశెట్టి వెంకటరాజం పాల్గొన్నారు.

జయశంకర్‌సార్‌కు నివాళి


కేశవపట్నంలో నివాళి అర్పిస్తున్న నాయకులు


చిగురుమామిడిలో..

శంకరపట్నం: కేశవపట్నంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విశ్వబ్రాహ్మణ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సదానందం, రవీందర్, రాజాచారి, సంతోష్, సతీష్, లింగమూర్తి, ఈశ్వర్, సుమన్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండల విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక గాంధీ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు నాయకులు జయశంకర్‌సార్ అడుగుజాడల్లో పయనిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంక్షేమ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి సదాచారి, కొత్తపల్లి సత్యనారాయణ, తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థికసాయం అందజేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన చొప్పరి సూరమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని బుధవారం ఎంపీపీ రాణి సురేందర్ రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని సంతాపం తెలిపారు. అనంతరం రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు.

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి పాలకుర్తి చరణ్‌గౌడ్ ఇటీవల చొప్పదండిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం బుధవారం రూ. 5 వేల ఆర్థికసాయం చేశారు. ఈమేరకు ప్రధానోపాధ్యాయుడు కె.రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది, ఉపాధ్యాయులు మృతుడి తల్లి దండ్రులకు నగదు అందించారు.

వీణవంక: సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి మృతుల కుటుంబాలకు సాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు వీణవంక సర్పంచ్ నీల కుమారస్వామి. గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు రూ.3వేలు అందిస్తున్నారు. ఇటీవల తొమ్మిది మంది మృతి చెందగా బుధవారం ఒక్కో కుటుంబానికి రూ.మూడువేల చొప్పున ఆర్థికసాయం అందించారు. ఇప్పటి వరకు సుమారు 200 మంది కుటుంబాలకు సాయం చేయడం పట్ల సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు. వెంట బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సంపత్, మొండయ్య, భిక్షపతి, రాజు, కృష్ణచైతన్య, ఓరెం క్రాంతి, ఓరం శ్రీనివాస్, ఓరెం మధు, లింగయ్య, రెడ్డి రాజుల రవి, రాజేందర్ ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట బస్టాండ్ కూడలి వద్ద సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ కర్ర సత్యప్రసన్న రూ.50 వేల విరాళం అందజేశారు. గౌడ సంఘం అధ్యక్షులు వెంకటయ్యగౌడ్, సుద్దాల మల్లేశంగౌడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకుల అరెస్టు

రామడుగు/చొప్పదండి/మానకొండూర్: కరీంనగర్ జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బుధవారం ఉదయం రామడుగు,చొప్పదండి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మానకొండూర్ మండలానికి చెందిన బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అరెస్టులకు భయపడమన్నారు.

ఆరె కులస్తులకు రూ.లక్ష సాయం వర్తింపచేయాలి

జమ్మికుంట: ప్రభుత్వం బీసీల్లోని 15 కులాలకు అమలు చేస్తున్న రూ.లక్ష ఆర్థికసాయం, ఆరెకులస్తులకు వర్తింపచేయాలని ఆరెకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంగిలే రామారావు కోరారు. బుధవారం పట్టణంలో ఆరెకుల సంఘం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆరె కులస్తులు దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారని, వారికి రూ. లక్ష ఆర్థికసాయం అందించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుల అదర్సండే నాగేశ్వర్‌రావు, తిప్పారపు బాపురావు, ప్రధాన కార్యదర్శి బెంబిరి కిషన్‌రావు, హుజురాబాద్ నియోజకవర్గ ఇచార్జి ఇంగిలే ప్రభాకర్, దిలీప్, అరె కులస్తులు తదితరులు పాల్గొన్నారు.